
# అరుగు

కె. వాసవదత్త రమణ



"ఎడమవైపుకు తిప్పు" రిక్షా అతనితో అన్నాను.

అమ్మవారి కోవెల నుంచి శ్రావ్యంగా కీర్తనలు వినపడుతున్నాయి. రిక్షా మునసబు గారిల్లు దాటింది. వాళ్ళ దొడ్లోనే నేనూ, వాళ్ళమ్మాయి లక్ష్మి ఎన్నో ఆటలు ఆడుకున్నాం. రెండిళ్ళ అవతలే దర్జీ మస్తాన్ మిషను కొట్టు. చిన్ననాటి జ్ఞాపకాలు నన్ను అలల్లా సృజిస్తుంటే మనస్సంతా ఆహ్లాదంగా అయింది. నాయుడి గారికి మూడో ఇల్లు మా ఇల్లు - పెంకుటిల్లు అయినా ముచ్చటగా పొందికగా ఉంటుంది. ముందు పెద్ద అరుగు. అదంటే నాకెంత ఇష్టమో! అరుగు మీద నాన్న, అమ్మ, అక్క, చెల్లి, ఇద్దరు తమ్ముళ్ళు అందరూ ఎదురుచూస్తూ వున్నారు నా రాకకోసం!

రిక్షా ఆగగానే అందరి కళ్ళలో వేల మతా బులు!! ఆ వెలుగులోకి జాలువారుతున్న అభిమా నానికి నేను పులకించిపోయాను.

''ఎన్నాళ్ళయింది సీతా నిన్ను చూసి!'' నాన్న గొంతు వణికింది చిన్నగా.

''ఏవే అలా చిక్కిపోయావు!'' అమ్మ కళ్ళలో సన్నటి తడి.

సామాన్లు లోపలపెట్టి నన్ను మహరాణిలా లోపలికి తీసుకువెళ్ళారు అందరూ.

''అక్కా! కాఫీ!'' చెల్లాయి ఇత్తడి గ్లాసులో తెచ్చిన కాఫీ ఒకరకమైన వింత వాసనతో రుచిగా ఉంది.

''ఏరా గోపీ! ఎలా చదువుతున్నావు!''

బదులుగా రిపోర్టు పట్టుకువచ్చాడు తమ్ముడు.

''వెరీగుడ్! టెన్తు ఫైనల్లో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి'' అన్నాను మెచ్చుకో లుగా!

''ఏరా! రామూ! కాలేజీ ఎలా ఉంది!''

''బాగానే వుంది అక్కా!''

''లెక్కల్లో కష్టంగా ఉంటేను ట్యూషను పెట్టిం చాము!'' అమ్మ అందుకుంది.

''ఎక్కడ?''

''అంకమ్మ చెట్టు దగ్గర. సైకిలు అద్దెకు తీసుకుని వెళుతున్నాడు'' అమ్మ వాడివంక ప్రేమగా చూస్తూ అంది.

''ఆ'' అంటూ నవ్వేశాను. అమ్మకు పెద్దకొడు కంటే వల్లమాలిన ఆపేక్ష!

''లేమ్మా! స్నానం చేద్దువుగాని'' నాన్న మాట లకి,

''ఒక్క నిముషం నాన్నా!'' అంటూ సూట్‌కేసు తెరిచి నాన్నకోసం కొన్న కొత్త బట్టలు తెసి ఇచ్చాను.

ఆయన కళ్ళు చెమర్చాయి.

''నేను నీకు కొనిపెట్టవలసిందిపోయి, ఆడ పిల్లవి నువ్వు సంపాదించి తెచ్చిపోస్తుంటే తీసుకునే దౌర్భాగ్యాన్ని కలిగించాడాదేముడు!'' ఆవేదన సుళ్ళు తిరిగింది ఆయన కంఠంలో!

''అవేం మాటలు నాన్నా! అదే కొడుకిస్తుంటే తీసుకోరా!'' అనునయంగా అన్నాను.

అమ్మకి బట్టలు, తమ్ముడికి వాచీలు, చెల్లాయికి చిన్న గొలుసు, అక్కకి బావకి టేప్‌రికార్డర్ ఇచ్చాను. రాముకి వెయ్యి రూపాయలు ఇచ్చి సైకిల్ కొనుక్కో మన్నాను.

అందరి ముఖాలు ఆనందంతో వెలిగిపో యాయి. అక్క ముఖమే కొద్దిగా దిగులుగా అనిపిం చింది. ఎందుకనో! భోజనాలు అయ్యాక నెమ్మదిగా పక్కమీద వాలాను. కిటికీలోంచి నేను పెట్టిన మల్లె తీగ ఆప్యాయంగా నన్ను పలకరిస్తోంది. నా మనసు గతంలోకి పరుగుతీసింది.

***

''హాస్పిటల్ పట్టుమని పది మైళ్ళు లేదు. ఇందులో పెద్దగా ఆలోచించాల్సింది లేదు. అయినా ఈరోజుల్లో అందరు ఆడపిల్లలు నర్సు కోచింగ్‌లోకి చేరుతున్నారు! మీ కిష్టమైతే సీతను రేపు తీసుకెళ్ళి అక్కడ హాస్టల్లో చేర్చేస్తాను. ఆలోచిం చుకోండి!'' నర్సు మరియమ్మ అరుగు మీద

**''నేను నీకు కొనిపెట్టవలసింది పోయి, ఆడపిల్లవి నువ్వు సంపాదించి తెచ్చిపోస్తుంటే తీసుకునే దౌర్భాగ్యాన్ని కలిగించాడాదేముడు!'' ఆవేదన సుళ్ళు తిరిగింది ఆయన కంఠంలో!**

కూర్చున్న నాన్నతో చెప్పేసి వెళ్ళిపోయింది.

''నాకిష్టం లేదు'' అని నాన్న అనగానే నేను అమ్మవంక చూశాను.

ఎలాగోలా కష్టపడి టెన్తు పరీక్ష పాసయ్యాను. మరియమ్మ నర్సు ఉద్యోగం గురించి నాలో ఆశలు రేపి పోయింది. అదీకాక ఇంటి ఆర్థిక స్థితి అంతంత మాత్రంగానే వుంది. నేను ఆ ట్రైనింగు పూర్తిచేస్తే హాయిగా మరియమ్మలాగా బతకవచ్చు అనిపి స్తోంది.

''పెళ్ళి కావల్సిన పిల్లను, దూరంగా పెట్టి చది వించడమా!'' నాన్న ఒప్పుకోలేదు.

ఈలోగా దేముడిలా నాయుడుగారు మా ఇంటి ముందునుంచి వెళుతూ అరుగు మీద కూలబడ్డారు – 'ఏమిటీ సంగతి' అంటూ!

నాన్న వివరంగా చెప్పాడు.

''మనూళ్ళో ఆడాళ్ళు సదూకోవడం తక్కువే కాని పట్నాల్లో అందరూ చదువుతున్నారయ్యా! అయినా నీ పరిస్థితి ఏం బావుంది చెప్పు! ముందు పెద్దదానికే మునిపెట్టడానికి వెనకాడుతున్నావు! నిండా పదిహేడేళ్ళు లేవు సీతకి. అప్పుడే ఏం తొందరవచ్చింది దానికి చేయడానికి! పంపే సేయి!'' అని సలహా ఇచ్చి చక్కాపోయాడు.

''వాడి కూతుర్నయితే పంపుతాడా!'' నాన్న కస్సుమన్నాడు.

అమ్మ గడపకివతల వత్తులు చేసుకుంటూ కూర్చుని వుంది.

''అమ్మా! నే వెళతానే!'' చిన్నగా అన్నాను.

నాకేసి చూసి దీర్ఘంగా నిట్టూర్చి, ''పోనీండి, అదీ సరదా పడుతోంది! చదువుకోగానే – మూడు ముళ్ళు వేసేద్దాం!''

అమ్మ నాకు సపోర్టు చేయడం చూసి అక్క విశాల అసూయగా నావంక చూసి కళ్ళు తిప్పు కుంది, కరివేపాకు పచ్చడికోసం ఆకులు వలుస్తూ!


నాకు నవ్వొచ్చింది! దానికి చిన్నప్పట్నుంచీ కుళ్ళే! చదువబ్బలేదు – కాని ఎంతసేపు కబుర్లు, ముచ్చట్లు! ఇక్కడి విషయాలు అక్కడికి మోయడం దానికి యమా సరదా!

ఎట్టకేలకు నాన్న ఒప్పుకున్నాడు! ఆర్థికంగా పేదదాన్ని కాబట్టి నాకు స్కాలర్‌షిప్ మంజూరవ్వ డంతో ఎవ్వరికి భారం కాకుండా చదువు, ట్రైనింగు అన్నీ పూర్తిచేసుకున్నాను!

నేను సెలవల్లో వస్తున్నానన్న కబురు అంద గానే ఇంటిల్లిపాది అరుగుమీద చేరి నాకు స్వాగతం పలికేవారు!

ఆ ప్రేమలు, అభిమానాలు, అనుభవించిన వాళ్ళకే వాటి విలువ తెలుస్తుంది. పదేపదే అవే కావాలని మనసు పరితపిస్తుంటుంది!

దుబాయిలో నర్సు పోస్టులకు అందరూ అప్లికే



షన్లు పడేస్తూ నాచేత బలవంతంగా పెట్టించారు. ''నాన్నకి తెలిస్తే చంపేస్తాడు!'' ఎంత భయపడినా ఫ్రెండ్స్ ఒప్పుకోలేదు.

''అందరిని తీసుకోరు. ఊరికే పెట్టడమే కదా'' అంటూ ఆ కాగితాలు అన్నీ పెట్టించారు. అందరికి వీడ్కోలు చెప్పి ఊరు చేరేటప్పటికి ఇంట్లో అందరి ముఖాలు దిగులుగా వున్నాయి.

సాయంత్రం నాన్న అరుగు మీద కూర్చుని చేంతాడు పేనుకుంటూ నెమ్మదిగా చెప్పాడు – అక్క విశాలకి చిన్నప్పటినుంచి మీ అత్తయ్య కొడుకు వెంకటరత్నం బావకిచ్చి చేయాలని అనుకున్నదే. ఇప్పుడు బావకి వేరే సంబంధాలు చూస్తున్నారట.

నాన్న కళ్ళల్లో చెమ్మ చేరింది. ''అసమర్థుడనమ్మా నేను! గంపెడు సంసారాన్ని ఈదలేని చేతకానివాడ్ని అయ్యాను''.

దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి మనిషిని ఎంత కృంగదీయగలదో నాన్నలాంటి రైతును చూస్తే అర్థమవుతుంది. ఒకప్పుడు పులిలా ధైర్యంగా మాట్లాడగలిగే నాన్న బేలగా అవ్వడం చూసి నేను తట్టుకోలేకపోయాను.

> **నాన్న కళ్ళల్లో చెమ్మ చేరింది. ''అసమర్థుడనమ్మా నేను! గంపెడు సంసారాన్ని ఈదలేని చేతకానివాడ్ని అయ్యాను''. దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి మనిషిని ఎంత కృంగదీయగలదో నాన్నలాంటి రైతును చూస్తే అర్థమవుతుంది. ఒకప్పుడు పులిలా ధైర్యంగా మాట్లాడగలిగే నాన్న బేలగా అవ్వడం చూసి నేను తట్టుకోలేకపోయాను.**

''అవేం మాటలు నాన్నా! అలా అనుకుంటే ఎవ్వరూ బతకలేరు? రేపు వెళ్ళి అత్తయ్యవాళ్లతో మాట్లాడదాం! ఏమంటారో చూద్దాంలే!''

''అమ్మా! నేను బావను తప్ప వేరే ఎవ్వరినీ చేసుకోను'' విశాల ఏడుస్తూనే వుంది రాత్రంతా.

అమ్మా, నాన్న, నేను అత్తయ్య వాళ్లింటికి వెళ్లాం. తోడబుట్టిన చెల్లెలు అయిన అత్తయ్య గంటుముఖం పెట్టుకుని కూర్చుంది మమ్మల్ని చూడగానే.

మావయ్య ఆదరంగా ఆహ్వానించాడు.

''బావా! విశాలను వెంకటరత్నానికి ముందు నుంచి అనుకున్నదే కదా! అదే అడగడానికి వచ్చాను!'' నాన్న డైరెక్టుగానే అడిగాడు.

మామయ్య ఏదో అనేంతలో అత్తయ్య అందుకొని –

''రత్నానికి రెండు లక్షలు కట్నాలు ఇస్తామంటూ వందలమంది తిరుగుతున్నారన్నయ్యా'' అంది.

''అలా అంటే ఎలా అన్నపూర్ణ!'' నాన్న కష్టంగా అన్నాడు.

అత్తయ్య తన ధోరణిలో చెప్పుకుంటూ వెళ్లిపోయింది. గతిలేనివాళ్లమన్నట్లు మాట్లాడుతుంటే ఇక నేను సహించలేకపోయాను.

''అత్తయ్యా, ఎంతిస్తే, ఏం చేస్తే బావకు మా అక్కతో పెళ్ళికి ఒప్పుకుంటావు?''

అత్తయ్య నాకేసి వింతగా చూసి, ''పాతికవేలు రొఖ్ఖం! మూడు కాసుల బంగారం, వెండి కంచం! పెళ్ళి ఘనంగా చేయాలి'' వెటకారంగా అంది.

''అలాగే చేస్తాం! ముహూర్తాలు పెట్టించు!'' గట్టిగానే అన్నాను.

నాన్న తెల్లబోయాడు – ''సీతా, తెలివుందా ఒంటిమీద!''

అమ్మ కంగారుగా – ''ఎలా చేస్తాం!'' అంది.

''పొలం ఉన్నది కాస్తా అమ్మేసి!'' తాపీగా అని నిర్ఘాంతపోయిన అమ్మను రెక్కపట్టుకుని లేవదీసి నాన్నతోపాటు బయటికి నడిచాను.

***

విశాల పెళ్లి బ్రహ్మాండంగా జరిగింది. నాన్న నా మాట వినేవాడో కాదో కాని ఇంటికి వచ్చి విషయాలన్నీ చెపుతుండగానే విశాల వెళ్లి బావిలోకి దూకేసింది. నాన్న హడలిపోయి పొలం వెంటనే బేరం పెట్టేశాడు. విశాల బావ చిటికెనవేలు పట్టుకొని వెనక్కి చూడకుండా వెళ్లిపోయింది – మాకు సొంత ఇల్లు ఒక్కటి మిగిల్చి!

నాన్న పొలం కౌలుకి తీసుకుని సేద్యం మొదలు పెట్టినా వర్షాలు లేక పంటలు పండలేదు. చేను పూర్తిగా ఎండిపోయింది. దరిద్ర దేవత ఇంట్లో తాండవం చేస్తోంది. ఇత్తడి సామానంతా అమ్మేశాము. అమ్మ ఒంటిమీద బంగారం శెట్టి ఇంట్లోకి తాకట్టుగా వెళ్ళిపోయింది. నాన్న తనలో తానే కుమిలిపోతున్నాడు!

ఇలాంటి సంకట పరిస్థితిలో వరంలా అన్నట్టు దుబాయిలో నర్సు ఉద్యోగం నన్ను వెతుక్కుంటూ వచ్చింది.

నాన్న అంగీకారం తీసుకోకుండా, నేనే స్వతంత్రంగా తెగించి నా ఇరవయ్యవ ఏట ధైర్యంగా విమానం ఎక్కి వెళ్లిపోయాను.

***

అప్పుడప్పుడు ఉత్తరాలు, నాయుడు గారింటికి మధ్యలో ఫోన్లు – నా వాళ్ళ మాటలు వినపడగానే ప్రాణం లేచివచ్చినట్టు అనిపించేది. మనస్సు టపటపా పక్షి రెక్కలా కొట్టుకునేది. నా వాళ్ల దగ్గరికి, నా ఊరికి ఆ క్షణమే పారిపోదామనిపించేది. ఆ తపన అణుచుకోవడం కన్నా హాయిగా చచ్చిపోవడమే సుఖంగా అనిపించేది. కాని నెమ్మదిగా అక్కడి వాతావరణానికి, పరిస్థితులకు అలవాటుపడిపోయాను. దేముడు మనిషికిచ్చిన గొప్ప వరం – మరుపు!

మళ్లీ ఇదే నే రావడం! గతం నుంచి వర్తమానంలోకి వచ్చాను.

***

నాన్నా! అక్కని అత్తయ్యవాళ్లు బాగానే చూసుకుంటున్నారా!'' అమ్మ, అక్కా వంట హడావుడిలో వుండగా అరుగు మీద నాన్న పక్కన చేరి అడిగాను.

''బాగానే చూస్తున్నారు!''

''అక్క ముఖం దిగులుగా వుంటేను!''

''పదేళ్లయింది. దానికి పిల్లల్లేరని అందరికి చిన్న చూపు. చివరికి రెండో పెళ్లి చేస్తారని దానికి భయం పట్టుకుంది!''

''ఛ! రత్నం బావ అలాంటివాడా!''

కాదు, కాని అత్తయ్య ఊరుకుంటుందా, రోజూ దెప్పుతూనే వుంటుంది!''

***

అక్కని పట్నం తీసుకెళ్లి అన్ని పరీక్షలు చేయించాను. బావని అత్తయ్య వాళ్లకి తెలియకుండా ఒప్పించి అతనికి అన్ని పరీక్షలు చేయించి, మందులు రాయించి తీసుకువచ్చాను. అప్పటికి దాని ముఖంలో కొద్దిగా ధైర్యం వచ్చింది. బావకు తెచ్చిన బట్టలు, బంగారు గాజులు అన్నీ తీసుకుని సంబరంగా వెళ్లిపోయింది వాళ్ల ఊరికి!

మళ్లీ పది రోజులకు దుబాయి ప్రయాణం. సెలవలు అయ్యి ఆ ఇంటిని, నా వాళ్లను వదల్లేక వదల్లేక బయలుదేరాను. కాని ఆశ్చర్యంగా ఈసారి ఏడుపులు పెడబొబ్బలు లేవు. అందరూ సంతోషంగా సాగనంపారు – అరుగు మీద వరసగా చేరి! ఒక్క నాన్న ముఖంలో విషాదచ్ఛాయలు ముసిరి వున్నాయి. అమ్మ కళ్లల్లో పెళ్లి కావల్సిన పిల్ల అన్న దిగులు! రిక్షా మలుపు తిరిగేవరకు అందరూ అరుగు మీద నుంచి చేతులు ఊపుతూనే వున్నారు.

***

''సీతా! ఫోన్ ఫర్ యూ!'' యాసిన్ చెప్పి వెళ్లింది.

గబుక్కున డ్యూటీ రూమ్‌లోకి పరుగెత్తాను.

''నాన్నా!'' కంగారుగా అన్నాను.

''కంగారేం ఏదవ్మా! అందరం బాగానే వున్నాము!''

అప్పటికికాని నాలో వణుకు తగ్గలేదు. ఎందుకంటే ఎప్పుడూ నేనే ఫోన్ చేస్తాను – నాయుడుగారింటికి! అలాంటిది నాన్న చేశారేంటి?

''ఏమిటి నాన్నా విషయం!''

''రాము...'' ఆగాడు నాన్న.

''ఏం నాన్నా! కొత్తగా చేరిన ఉద్యోగం బాగా లేదా! మానేయమను. మంచిది వెతుక్కోవచ్చు.''

''అదికాదు సీతా. వాడి కాలేజీలో లలిత అనే అమ్మాయి క్లాస్‌మేట్! ఆ అమ్మాయి రాత్రినుంచి మనింట్లోనే వుంది''

''మనింట్లోనా!'' ఆశ్చర్యంగా అన్నాను.

నాన్న ఏం బాధపడుతున్నాడో కానీ ఒక్కక్షణం ఆగి గొంతు పెగల్చుకుని –

''ఆ అమ్మాయికి సవతి తల్లి, వేరే సంబంధం కుదిరిస్తేను పారిపోయి రాత్రి మనింటికి వచ్చేసింది! రాము ఆ అమ్మాయినే చేసుకుంటానన్నాడు! మాట ఇచ్చాడట!''

''రాము అంత పెద్దవాడయ్యాడా'' అప్రయ

త్నుంగా అన్నాను.

నాన్న ఏం మాట్లాడలేదు. అయినా ఏం చెబుతాడు? కూతురి సంపాదన మీద బతుకుతూ కొడుకు రెక్కలు రాగానే తన స్వార్థం చూసుకున్నాడని చెప్పగలడా?''

''సరే అయితే, ఏం చేద్దాం నాన్నా''

''అదేనమ్మా! నువ్వేం చెయ్యమంటావో అడుగుదామనే!''

''రాము అడగమన్నాడా! మీరే అడుగుతున్నారా?''

నా ప్రశ్న ఆయన్ని ఉక్కిరిబిక్కిరి చేసిందని నాకు తెలుసు! అయినా కొన్ని చేదునిజాలు చెవులతో వినాలి. మనసారా అనుభవించాలి. దానికి సిద్ధపడే అడిగాను.

''ఏదైనా ఒక్కటే కదా!'' నాన్న గొణిగాడు.

నా పెదాలపై పేలవమైన చిరునవ్వు వెలసింది.

''నాన్నా. పరాయి పిల్లను ఇంట్లో ఎన్నాళ్లని అట్టిపెట్టుకుంటాం? మంచి ముహూర్తం చూసి పెళ్ళి చేయండి'' నిబ్బరంగా అనేసి ఫోను పెట్టేశాను.

ఆ మర్నాడు, ఆ తర్వాత ఎన్నో రోజులు రాము కోసం ఎదురుచూశాను ఉత్తరం వస్తుందన్న చిన్న ఆశతో. వేయి కళ్లతో ఎదురు చూశాను కాని రాలేదు.

కోపంతో అవమానంతో ఉడికిపోయాను. 'నేను ఎవరికోసం ఇలా బతుకుతున్నాను' 'నాకు కోరికలు లేవా? అన్ని అణుచుకుని రాయిలా వున్నాను. ఎవరికోసం? ఇలా అందరూ తలోదారి చూసుకుంటే? చివరికి నేను?' నా ప్రశ్నే భయంకరంగా తోచింది.

***

డబ్బు పంపుతూనే ఉన్నాను – మధ్యలో రెండు మూడుసార్లు నాన్న నా పెళ్లి ప్రస్తావన తెచ్చాడు – ''ముప్పై దాటుతున్నాయి అని అమ్మ రోజూ గోలపెడుతోంది'' అంటూ.

నాకు జీవితం అంటే విసుగు పుడుతోంది. వయసు – సుఖంకన్నా తోడుకావాలని పరితపిస్తోంది. బయలుదేరి ఇండియా వెళ్లాను. రిక్షా వీధి మలుపు తిరుగుతుంటే అదో ఆనందం, ఎంతో తృప్తి! అరుగుమీద ఇంటిల్లిపాదీ స్వాగతం పలికారు! ఇల్లంతా పాతబడిపోయింది. అరుగు అంతా పెచ్చులు లేచి వికారంగా వుంది.

లలిత బాగానే పలకరించింది. ఇల్లంతా తనే అజమాయిషీ చేస్తోంది. అమ్మ పూజలు, కీర్తనలు ఆధ్యాత్మికంలో పడిపోయింది.

''నాన్నా! ఇల్లు బాగుచేయిద్దాం!''

''పెంకులు మారిస్తే పోతుంది చాలు!'' అంటున్న నాన్న మాటలకి రాము అడ్డొచ్చాడు.

''అక్కా డాబా వేసుకుందాం?''

''ఎందుకురా?'' నాన్న తీసుకున్నాడు.

''నా అందమైన అపురూపమైన బాల్యం గడిచింది ఈ ఇంటిలోనే!''

''ఇంకెవరికోసమో కాదుకాని నేను ఇల్లు ఇలా చూడలేను నాన్నా!'' అని ఇంజనీరును పిలిపించి, ప్లాను వేయించి, నాన్న చేతిలో తెచ్చిన డబ్బంతా పెట్టాను.

నాన్న అయిష్టంగానే ఒప్పుకున్నాడు. మర్నాడు నా చేత కొన్ని కాగితాలు సంతకం పెట్టించుకున్నాడు.

''ఏమిటి నాన్నా ఇది. పోయినసారి సంతకాలు తీసుకున్నావు?'' ఆశ్చర్యంగా నేను అనేంతలో నాన్న ఆ కాగితాలతో బయటకు వెళ్ళిపోయాడు. నాన్న తెచ్చిన రెండు సంబంధాలు కుదరలేదు. ఒక పెళ్లి సంబంధం నాకు నచ్చలేదు. రెండోవాళ్లకి నేను నచ్చలేదు. అక్కకి అయిదో నెల. అది కడుపుతో ఎత్తు పొట్టతో తిరుగుతుంటే ఆనందంగా అనిపించింది. రాముకి ఏడాది కొడుకు అప్పుడే.

''రాము! అరుగు మటుకు అలాగే ఉంచేయరా! దాన్ని మార్చకు. నాన్నకి, నాకు ఆ అరుగును చూస్తే ఆత్మబంధంగా అనిపిస్తుంది. అలాగే మొక్కలు. అమ్మ పూజకి ఆటంకం లేకుండా చుట్టూరా పూలమొక్కలు వేయించు'' ఇంటిపని అప్పజెప్పి నిశ్చింతగా బయలుదేరాను. అందరు అరుగు మీద చేరి నేను వెళ్లేవరకు చేతులు ఊపుతూనే వున్నారు.

***

విమానం మధ్యలో నా పక్కన కూర్చున్న అతను సడెన్‌గా కుప్పకూలిపోయాడు. హైఫీవర్‌తో వచ్చిన గిడ్డినెస్ అది. నా దగ్గరున్న మాత్రలు వేసి తడిబట్ట పెట్టి ఒళ్లంతా తుడిచి తోచిన సపర్యలు చేశాను, ఫోన్‌లో కంట్రోలు రూమ్‌ను కాంటాక్ట్ చేసి. దుబాయి చేరగానే అంబులెన్స్ రెడీగా వుంది. లాండ్ అయ్యేటప్పటికి కొద్దిగా తేరుకున్నాడు. వెంటనే హాస్పిటల్‌కి తరలించి అతని పరిస్థితి ఫరవాలేదనిపించగానే నేను ఇంటికి వెళ్లిపోయాను. నేను డ్యూటీలో జాయిన్ అయిన నెలరోజులకు అక్కడ సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా చాలామంది ఉద్యోగాలు రిజైన్ చేసి వాళ్ల దేశాలకు వెళ్లిపోవడం మొదలుపెట్టారు. హఠాత్తుగా నా భవిష్యత్తు అంధకారం అయింది.

***

''ఆరోజు విమానంలో మీ ఫస్ట్ ఎయిడ్ నన్ను బతికించింది!'' కారులో పక్కన కూర్చున్న శ్రీధర్ అభిమానం నిండిన కళ్ళతో అన్నాడు – నావంక చూస్తూ.

''నేను లేకపోయినా ఎయిర్ హోస్టెస్‌లో చాలా కేర్‌గానే చూస్తారు'' ఇబ్బందిగా నవ్వాను.

అతనితో పరిచయం అయి మూడు నెలలు కావస్తోంది. దుబాయికి వ్యాపార నిమిత్తం వచ్చాడు. రేపు వెళ్లిపోతున్నాడు. వెళ్లేముందు చిన్న పార్టీ అంటూ బలవంతం చేసి హోటల్‌కి తీసుకువచ్చాడు.

ఆర్డరు ఇచ్చాక రిలాక్సింగ్‌గా వెనక్కి వాలి –

''సీతా! మీ గురించి మీరు కొంత చెప్పారు. నేను కొంత అర్థం చేసుకున్నాను. నా గురించి చెబుతాను వినండి. నేనో అమ్మాయిని మనసారా ప్రేమించాను. ఆ అమ్మాయి నా ప్రేమను కాదని వేరే అతన్ని చేసుకుంది. అది భరించలేక నేను బిజినెస్ వ్యాపకంలో మునిగిపోయాను. పెళ్లంటేనే విరక్తి కలిగింది. కానీ ఈమధ్య పెళ్లంటే తోడు నీడ అని తెలుస్తోంది. నా మనసులో భావాల్ని అర్థం చేసుకునే మరో మనస్సుకోసం వెంపర్లాట మొదలైంది. ఒంటరితనం అంటే విసుగొస్తోందనిపిస్తోంది. అది మిమ్మల్ని చూశాక, నా అభిప్రాయం ఇంకా బలపడింది''.

ఉలిక్కిపడ్డాను నేను.

అతను నాకేసి తదేకంగా చూసి –

''మనమేమీ టీనేజర్లం కాదు. నాకు ముప్పై ఏడేళ్ళు! మీకిష్టమైతే మిమ్మల్ని పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను''

అతని చెంపలపై సన్నగా నెరిసిన వెంట్రుకలు డిమ్‌లైట్‌లో వెండి తీగల్లా మెరుస్తున్నాయి. అలసిన అతని కళ్లు నా నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.



అనుకోని అదృష్టం ఇది! ఎండిపోయిన భూమి చిగురిస్తున్న అనుభూతి!!

"అమ్మా, నాన్నను సంప్రదించాలి" చిన్నగా అన్నాను.

వెంటనే నవ్వేస్తూ "అలాగే! రేపే మన ప్రయాణం, దుబాయిని శాశ్వతంగా వదిలేసి!" అన్నాడు హుషారుగా.

***

రిక్షా మలుపు తిరుగుతోంది. ఒకరకమైన ఉద్విగ్నతలో ఉన్నాను. బయలుదేరే ముందు నాన్నకు ఫోన్ చేసి శ్రీధర్ విషయం, ఉద్యోగం ప్రాబ్లం - చూచాయగా చెప్పాను. అందరు ఎలా రిసీవ్ చేసుకుంటారో నన్ను!

నేను వస్తానని తెలిసి ఎవ్వరు బయటకు రాలేదు. అసలు అరుగే లేదు. అంతా గదులే, అంతా గచ్చే! ఎవ్వరి ముఖాలలో స్వాగత చిరునవ్వులు లేవు. మనస్సంతా నలిబిలి అయింది.

"అదేమిటక్కా! బంగారం లాంటి ఉద్యోగం వదిలేశావా?" రాము మొదటి ప్రశ్న.

"పెళ్లి కొడుకును వెతుక్కుని తెచ్చుకున్నావా?" పెళ్లయి కడుపుతో వున్న అక్క ముఖంలో ఆశ్చర్యం.

"వదినగారు? అతనిది మన కులం కాదుట కదా?" అమాయకంగా అడుగుతున్నట్టు నటిస్తూ వెటకరిస్తోంది లలిత.

అమ్మ ముఖంలో సంతోషం లేదు - విచారమూ లేదు. ఆవిడ ఆధ్యాత్మిక లోకంలో మునిగిపోయింది.

నేను మౌనంగా ఎప్పటిలాగే నాకు వచ్చిన ఇన్సూరెన్సు డబ్బు, పిఎఫ్ సొమ్ము అంతా నాన్న చేతిలో పెట్టేశాను.

"నాన్నా! ఈ డబ్బును ఫిక్సిడ్‌లో వేసి చెల్లి పెళ్లికి, తమ్ముడు చదువుకి ఉపయోగించండి" నేను ఎవ్వరికి దూరం కాలేదు.

"మీకు, అమ్మకు ఎప్పటికీ నేనున్నాను, అది మర్చిపోకండి" రుద్ధకంఠంతో అన్నాను.

"అత్తా! నాకేం తెచ్చావు" రాము కొడుకు ప్రకాశ్ దగ్గరకు వచ్చాడు. వాడిని గట్టిగా ముద్దుపెట్టుకుని నా మెళ్లో గొలుసు తీసి వేశాను. ఇక నాన్న ఊరుకోలేకపోయాడు.

"పన్నెండేళ్లబట్టి ఏం తెచ్చావు ఏం తెచ్చావు అంటూ పెద్దవాళ్ల దగ్గర్నుంచి చంటాడి దాకా అందరూ దాని వెంట పడడమే కాని మనమేం ఇచ్చాం అని ఎవ్వరు ప్రశ్నించుకోరేం?"

"నాన్నా!" వారించాను. ఈ సన్నటి అనుబంధాలు కూడా తెగిపోతే, ఆ ఊహే నేను భరించలేను.

"సీతా! ఇహ నన్ను ఆపకు. ఇవాళ నేను నోరు విప్పకపోతే నేను మనిషినే కాదు. ఇన్నాళ్లు మగాడిలా బాధ్యతను నెత్తిన వేసుకుని కుటుంబాన్ని లాక్కొచ్చిందే? అందరు అది పెట్టింది తిని ఇంత వాళ్లయ్యారే! ఆఖరికి దాని చెల్లి పెళ్లికోసం కూడా డబ్బు పట్టుకువచ్చింది. కాని ఒక క్షణం కూడా - దాని భవిష్యత్తు గురించి ఒక్కక్షణం కూడా ఆలోచించలేదు. అలాంటిది ఇవాళ అది ఉద్యోగం మానేసి వచ్చిందని అందరూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారా? పెళ్లి చేసుకుంటోందని వెటకరిస్తున్నారా? బంగారు బాటు వర్తి బాతు అయిందని చులకన చేస్తున్నారా? ఆ వర్తి బాతే కావాలని శ్రీధర్ పెద్దమనసుతో ముందుకువచ్చాడు. అది నలుగురి కోసం ఆలోచిస్తే దానికోసమే ఆలోచించే మనిషి ఇన్నాళ్లకు ఎదురు వచ్చాడు" నాన్న ఆయాసంతో, కోపంతో రొప్పాడు.

"బాగానే వుంది. మధ్యలో మామీద పడిపోతున్నారా?" అక్క రుసరుసలాడింది.

"ఎవరు పెళ్లి చేసుకోవద్దన్నారు ఇన్నాళ్లవరకు" లలిత మాటలకు నాన్న భగ్గుమన్నాడు.

"నిజమే. నీలా పారిపోయి, దాని స్వార్థం చూసుకునే మనిషే అయితే సీతకిలాంటి రోజు వచ్చేదే కాదు. విశాలకోసం పొలం అమ్మితే, సీత కోసం ఇల్లు అమ్మి పెళ్లి చేసేవాళ్లం. హాయిగా పిల్లా పాపలతో సుఖంగా వుండేది. మేమందరం రోడ్డున పడేవాళ్లం? మీ ఆయన ఏ రైతో అయి కౌలుకి పొలం దున్నుకునేవాడే"

"సీతా! ఇహ నన్ను ఆపకు. ఇవాళ నేను నోరు విప్పకపోతే నేను మనిషినే కాదు. ఇన్నాళ్లు మగాడిలా బాధ్యతను నెత్తిన వేసుకుని కుటుంబాన్ని లాక్కొచ్చిందే? అందరు అది పెట్టింది తిని ఇంత వాళ్లయ్యారే! ఆఖరికి దాని చెల్లి పెళ్లికోసం కూడా డబ్బు పట్టుకు వచ్చింది. కాని ఒక క్షణం కూడా - దాని భవిష్యత్తు గురించి ఒక్కక్షణం కూడా ఆలోచించలేదు. అలాంటిది ఇవాళ అది ఉద్యోగం మానేసి వచ్చిందని అందరూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారా? పెళ్లి చేసుకుంటోందని వెటకరిస్తున్నారా?

"నాన్నా! అనవసరపు మాటలు వద్దు. ఇక అక్క పెళ్లి విషయం - మన కులం వాళ్లు కాదు. మనం నలుగురిలో తలెత్తుకు తిరగలేము. మళ్లీ లక్ష్మి పెళ్లి చేయడం ముందుముందు ఇంకా కష్టం అవుతుంది. నా యింట్లో పెళ్లి జరగడం నాకిష్టం లేదు" రాము ఖరాఖండిగా అన్నాడు.

"నా ఇల్లు" శరాఘాతంగా తాకిందా మాట!

శ్రీధర్‌కి ఫోన్ చేశాను వెంటనే రమ్మని.

"ఏమైంది సీతా" ఆదుర్దాగా అడుగుతున్నాడు శ్రీధర్ ఫోనులో.

"వచ్చేయండి త్వరగా?"

ఆ రాత్రి నిద్రలేదు నాకు.

పొద్దునే నాన్న కొన్ని బాండ్లు నా పెట్టెలో అడుగున పడేశాడు. తెల్లబోయాను.

"సీతా! ఇలాంటి రోజు వస్తుందని నువ్వు విమానం ఎక్కిన మొదటిసారే అనుకున్నాను. అందుకే నువ్వు పంపిన డబ్బులో కొద్దికొద్దిగా పక్కన పెట్టి ఇల్లు నడిపాము. అవి లక్షల రూపాయలు అయ్యాయి. న్యాయంగా అంతా నీదే. కొంతే ఇస్తున్నాను. ఇదే నా కట్నం. ఈ వయసులో కొడుకుల్ని, సొంత ఇంటిని, ఈ ఊరిని వదిలేసి నేను ఎక్కడికి రాలేదు. ఈ కట్టె ఇక్కడే కడతేరాలి. నా ఆశీస్సులు ఎప్పుడూ నీకు ఉంటాయి. నన్ను క్షమించు"

నాన్న భోరుమని ఏడ్చేశాడు.

కారు హారను మోగింది. శ్రీధర్‌ని అందరికి పరిచయం చేశాను. మనస్సంతా శూన్యంగా అయోమయంగా వుంది. అతనికి కొద్దికొద్దిగా విషయం అర్థమవుతోంది.

"సీతా. వెళదామా!" మృదువుగా అన్నాడు.

"పెట్టె లోపలుంది" బలహీనంగా వుంది నా గొంతు.

అతనే లోపలికి వచ్చి పెట్టె అంతా సర్ది నా చేయి పట్టుకున్నాడు 'పోదాం పద' అంటూ.

గుండె గబగబ కొట్టుకుంది. మనస్సంతా వణికింది. అయినవాళ్లు పరాయిగా చూస్తున్నారు. పరాయివాళ్లు అయిన వాళ్లవుతున్నారు.

"నామీద నమ్మకం లేదా!" ప్రశ్నిస్తున్నాయి అతని చూపులు.

"నామీద నాకే నమ్మకం పోయింది" అతని భుజం మీద తలవాల్చి వెక్కివెక్కి ఏడ్చేశాను.

అతను దగ్గరగా పొదువుకుని - "సీతా! ఇదే నీ ఆఖరి ఏడుపు కావాలి. ప్రేమను పోగొట్టుకున్న వాడికే దాని విలువ తెలుస్తుంది. నీ బాధను నాకన్నా బెటర్‌గా ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. అందుకే దేముడు మనల్ని కలిపాడేమో! ప్లీజ్ రిలాక్స్!" అతని లాలనకు తేరుకున్నాను.

అమ్మా నాన్నకు నమస్కరించి, నా యిల్లు అనుకున్న నా యింటిని వదిలి మరో ఇల్లు వెతుక్కుంటూ బయలుదేరాను, శ్రీధర్ చేయి పట్టుకుని.

ఎవ్వరూ బయటకు రాలేదు. మమ్మల్ని సాగనంపలేదు. అయినా అసలు అరుగే లేదుగా నిలబడటానికి! ఆప్యాయతలు అడుగంటిపోయాయి. అనురాగాలు శిథిలమయ్యాయి! అభిమానాలు ఆవిరయ్యాయి. కారు మలుపు తిరుగుతుంటే మసక కళ్లతో ఆఖరిసారి ఇంటి వంక చూశాను!

మేడమీద తనకు ఒక వృద్ధాప్యపు చేయి వీడ్కోలుగా చేయి ఊపుతోంది. అది నాన్న చేయిగా గుర్తించాను. పక్కనే లేత చేయి - రాము కొడుకు ప్రకాష్ 'మళ్లీ తొందరగా రా అత్తా' అంటూ టాటా చెబుతున్నాడు. నా కళ్లు విచ్చుకున్నాయి. సంతోషంగా చేయి ఊపాను. నాకు మనస్సు తేలికపడింది. ఏదో నూతనోత్సాహం నరనరాల్లో నిండింది.

పాత తరం ప్రేమలు, ఆప్యాయతలు, మమకారాలు పట్టుకు వేళ్లాడుతోంది. మధ్యతరం డబ్బు, అహంకారం, అసూయలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కొత్తతరం మళ్లీ పాత తరమే, పాత రోజులే కావాలని కోరుకుంటోంది. కొత్త జీవితం పట్ల ఆశలు నింపుకుంటూ శ్రీధర్ చేయి గట్టిగా పట్టుకున్నాను, ఆలంబనగా!!

★